https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

10 AM TO 1 PM

సంపుటి: 01 / సంచిక:32 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 17,2026

# మోదీకి రాహుల్, ఖర్గే శుభాకాంక్షలు

## ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష

- మోదీకి 76వ పుట్టినరోజు శుభాకాంక్షలు
- అఖిలేశ్, మాయావతి కూడా విషెస్
- శరద్ పవార్, ప్రియాంక చతుర్వేది శుభాకాంక్షలు
- విజయ్, స్టాలిన్ అభినందనలు
- బీజేపీ 'సేవా సంకల్ప్ అభియాన్' ప్రారంభం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17



ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా ప్రతిపక్ష పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన మంచి ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీకి శుభాకాంక్షలు చెబుతూ.. మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం శుభాకాంక్షలు తెలిపారు.

# వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి
- అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి
- సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం
- రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

తెలంగాణ వ్యాప్తంగా 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ' వేడుకలు సెప్టెంబర్ 17న అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ నాంపల్లిలోని చారిత్రాత్మక పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.





933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తాం..

# రేవంత్‌కు కేటీఆర్ ఛాలెంజ్

- సిట్టింగ్ జడ్జితో విచారణకు కేటీఆర్ సవాల్
- కేసీఆర్ ఆస్తులపై ఆరోపణలను ఖండించిన కేటీఆర్
- 67 ఎకరాల భూమిపై కేటీఆర్ వివరణ
- 933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తామని ప్రకటన
- రేవంత్ ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు.



# శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించిన తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 17:

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనమండలి కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, లెజిస్లేచర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు..

# త్రుటిలో తప్పిన ప్రమాదం

- డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ కారులో చెలరేగిన మంటలు
- ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన ఎమ్మెల్యే
- కారులో పవర్ బ్యాంక్ పేలడమే ప్రమాదానికి కారణం
- ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- ప్రజాపాలన దినోత్సవానికి వెళ్తుండగా ఈ ఘటన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్ర నాయక్‌కు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడగా, ఆయన కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

# రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్



- తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి
- రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు
- ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మా ప్రయోజనాలను కాపాడుకుంటాం..

# అమెరికా ఆంక్షల బిల్లుపై భారత్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17




రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించేందుకు వీలు కల్పించే కీలక బిల్లును అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో భారత్ స్పందించింది. అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని న్యూఢిల్లీ నిశితంగా పరిశీలిస్తోందని, అదే సమయంలో దేశ వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. రష్యా నుంచి భారీగా చమురు, సహజవాయువు కొనుగోలు చేసే దేశాలపై వంద శాతం సుంకాలు విధించే అధికారం ఈ బిల్లు ద్వారా అమెరికా అధ్యక్షుడికి లభిస్తుందిరష్యా నుంచి భారీగా భారత్, చైనా చమురు కొనుగోలు చేస్తున్నాయి. దీంతో భారత్‌పై కూడా భారీగా సుంకాలు విధించే అవకాశం ఉంది. తాజాగా ఈ బిల్లుపై భారత ప్రభుత్వం స్పందించింది. దేశ జాతీయ ప్రాధాన్యతలు, 140 కోట్ల మందికి అవసరమైన ఇంధన భద్రత ఆధారంగానే తాము నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని విదేశాంగ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. అమెరికాతో ఈ అంశంపై వివిధ స్థాయిల్లో చర్చలు కొనసాగుతున్నాయని కూడా తెలిపింది .అమెరికా ప్రతినిధుల సభ ఈ బిల్లును 262––159 ఓట్లతో ఆమోదించింది . ఇప్పుడు బిల్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కోసం వెళ్లింది. ఈ బిల్లుపై తాను సంతకం చేస్తానని ట్రంప్ గతంలోనే ప్రకటించారు. ట్రంప్ సంతకం చేస్తే ఈ బిల్లు చట్టంగా మారుతుంది. ఆ తర్వాత అమెరికా ప్రభుత్వం చట్టంలోని నిబంధనలను ఎలా అమలు చేస్తుందనేది అత్యంత కీలకంగా మారనుంది.

భూవివాదం.. శ్రీదేవి కుటుంబానికి

# సుప్రీంకోర్టు నోటీసులు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17




దివంగత నటి శ్రీదేవికి చెందిన ఆస్తి కేసుపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో 1988లో శ్రీదేవికి విక్రయించిన 2.7 ఎకరాల భూమిలో తమకూ వాటా ఉందంటూ ఎంసీ చంద్రశేఖరన్ కూతురు ఎంసీ శివగామి, కుమారుడు ఎంసీ నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై శ్రీదేవి భర్త బోనీ కపూర్, వారి కూతుళ్లు జాహ్నవి కపూర్, ఖుషీ కపూర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బోనీ, జాహ్నవి, ఖుషీకి వ్యతిరేకంగా గతంలో తాము వేసిన దావాను మద్రాస్ హైకోర్టు కొట్టివేసిందని శివగామి తెలిపారు. తర్వాతి విచారణ వరకు ఆ భూమిపై యథాతథ స్థితిని కొనసాగించాలని జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. కేసును మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని, ఇందుకోసం రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమిస్తామని బెంచ్ తెలిపింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది.

## హౌతీలతో అమెరికా రహస్య చర్చలు..

# సౌదీ సర్కారులో టెన్షన్ టెన్షన్..!

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

యెమెన్ విషయంలో అమెరికా అనూహ్యమైన అడుగేసింది. ఇరాన్ మద్దతున్న హౌతీ రెబల్స్ తో ఒమన్ లో రహస్యంగా సమావేశమైంది. ఈ చర్చల తర్వాత హౌతీల దూకుడును అడ్డుకోవడానికి సౌదీ అరేబియా కు ఎలాంటి ప్రత్యక్ష సైనిక మద్దతు ఇవ్వరాదని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించడం సంచలనం సృష్టిస్తోంది. ఈ చర్చలకు సంబంధించి బయటకు వచ్చిన నివేదికల ప్రకారం.. ఒమన్‌లోని మస్కట్‌లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయంలో గడిచిన వారాంతంలో ఈ భేటీ జరిగింది. ప్రాంతీయ మధ్యవర్తిగా ఒమన్ ప్రభుత్వం ఈ చర్చలకు సహకరించింది. ఈ సమావేశంలో అమెరికా తరఫున ఎంబసీ అధికారులు పాల్గొనగా.. హౌతీల నుంచి మహ్మద్ అబ్దుల్ సలాం (అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న వ్యక్తి), అబ్దుల్ మాలిక్ అల్ అజిరి వంటి సీనియర్ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. అమెరికా నౌకలపై దాడిచేసే ఉద్దేశం తమకు లేదని, 2025లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని హౌతీలు హామీ ఇచ్చినట్టు సమాచారం. ఇజ్రాయెల్ లేదా ఇతర వాణిజ్య నౌకలను కూడా లక్ష్యంగా చేసుకోబోమని హౌతీలు చెప్పినట్లు తెలిసింది. అయితే తమ దేశంపై సౌదీ దిగ్బంధనం విధించినందున, సౌదీకి సంబంధించిన నౌకలకు ఈ హామీ వర్తించదని స్పష్టంచేశారు. ఇటీవల ఎర్ర సముద్ర తీరంలో హౌతీలు కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో.. సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ అమెరికా సైనిక సహాయం కోరారు. అయితే హౌతీలతో తాము నేరుగా సంప్రదింపులు జరుపుతున్నామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇప్పటికే ధ్రువీకరించారు. తాజా భేటీతో సౌదీ అభ్యర్థనను అమెరికా తిరస్కరించినట్లయింది. ఈ పరిణామంతో దౌత్య మార్గాలను అన్వేషించాల్సిన ఒత్తిడి సౌదీ అరేబియాపై పెరిగింది.



మొదటిపేజీ తరువాయి

# 933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తాం..

గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇన్నాళ్లూ ప్రచారం చేసి.. అసెంబ్లీలో మాత్రం 67 ఎకరాలు ఉన్నట్లు సీఎం చెప్పారని కేటీఆర్ అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు 933 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం నిరూపిస్తే ఆ భూములను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పుట్టుపూర్వోత్తరాలతో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారని, తమ తాతకు వందల ఎకరాల భూమి ఉండేదని కేటీఆర్ చెప్పారు. ఇప్పుడు 67 ఎకరాలు ఉండటం తప్పా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించుకున్నానని చెబుతున్నా.. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ లాంటి ఇల్లు, ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన తమ్ముళ్లు ఏరోస్పేస్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక ఆయన చిన్నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో వివరించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేతలపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రతి పథకంలోనూ స్కామ్ ఉంటోందని ఆరోపించారు.

మొదటిపేజీ తరువాయి

## భూవివాదం.. శ్రీదేవి కుటుంబానికి

# సుప్రీంకోర్టు నోటీసులు

### ఏంటి వివాదం?

చెన్నైలో ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని షోలింగనల్లూరులో సర్వే నంబర్ 1/1బీలో ఉన్న వివాదాస్పద భూమిలో తమకూ వాటా ఉందని ఎంసీ చంద్రశేఖర్ పిల్లలు ఎంసీ శివగామి, ఎంసీ నటరాజన్ గతంలో ట్రయల్ కోర్టులో కేసు వేశారు. కేసును ట్రయల్ కోర్టు.. మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసింది. తాము చంద్రశేఖర్ వారసులమేనని, ఆయన తమ కన్న తండ్రి అని పిటిషనర్లు మద్రాస్ హైకోర్టుకు వెల్లడించారు. ఆ వివాదాస్పద భూమిని ఐదు సమాన భాగాలుగా విభజించాలని, అందులో 1/5వ వంతు వాటా తమకు కేటాయించాలని కోరారు. అలాగే, 1988 ఏప్రిల్ 19న రాజేశ్వరి, శ్రీలత, శ్రీదేవికి అనుకూలంగా అమలు చేసిన సేల్ డీడ్లను రద్దు చేయాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. అయితే, పిటిషనర్లు వేసిన దావా గడువు ముగిసిపోయిందని, కాబట్టి ఈ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. దీంతో మద్రాస్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

### పిటిషన్ గడువు తీరిపోయింది: కపూర్ కుటుంబం

పిటిషనర్లు వేసిన దావాకు చట్టబద్ధత లేదని కపూర్ కుటుంబం తరపున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. 'ఆస్తిని ఎప్పుడో 1988లో శ్రీదేవి కుటుంబానికి విక్రయించారు. పిటిషనర్లు 2025 ఏప్రిల్ 20న ఆ దావా వేశారు. అంతేకాకుండా శ్రీదేవి మరణం తర్వాత 2023లో ఆస్తి మ్యుటేషన్ కోసం నా క్లైంట్లు దరఖాస్తు చేశారు. ఆస్తి మ్యుటేషన్ కోసం నా క్లైంట్లు దరఖాస్తు చేసుకున్న తర్వాతే పిటిషనర్లు కేసు వేశారు' అని అభిషేక్ వాదించారు.

## బ్రిక్స్ సదస్సును భగ్నం చేయాలనుకున్న పాక్, ఐఎస్ఐ..

# ఉగ్ర కుట్ర బట్టబయలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

ఇండియా ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సును పాకిస్తాన్, ఆ దేశ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఐఎస్ఐ భగ్నం చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయం తాజాగా బయటపడింది. ఈ అంశంపై ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 11-13 వరకు ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. ఈ సదస్సు ఇండియా నిర్వహించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది. అయితే, ఇలాంటి సదస్సుకు ఆటంకం కలిగించాలని పాక్, ఐఎస్ఐ ప్రయత్నించాయి. జమ్మూ కాశ్మీర్ కథ్వా జిల్లాలోని హీరానగర్ సెక్టార్ నుంచి ఉగ్రవాదులను సరిహద్దుగుండా ఇండియా పంపించాలని ప్రయత్నించింది. సదస్సు సందర్భంగా దేశంలో పెద్ద ఉగ్రదాడి జరపాలని ప్రయత్నించింది. ఇందుకోసం హీరానగర్‌లోని బోబియా ప్రాంతంలో సరిహద్దు నుంచి ఇండియాలోకి చొరబడేందుకు కొన్ని స్థావరాల్ని కూడా పాక్ ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వ భద్రతా దళాలు ముందుగానే పసిగట్టాయి. ఆయా ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. పాకిస్తాన్‌లోని అమ్రు చాక్, సుక్మాల్ ప్రాంతాలు.. ఇండియాలోని హీరానగర్ ప్రాంతాన్ని సరిహద్దుగా పంచుకుంటాయి. ఇది మన సరిహద్దుకు అతి దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడినుంచి ఇండియాలోకి సులభంగా చొరబడవచ్చని పాక్, ఐఎస్ఐ భావించాయి. ఈ ప్రాంతంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోనే జమ్మూ-పఠాన్‌కోట్ హైవే ఉంది. ఇక్కడినుంచి ఇండియాలోని ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులు, సాధారణ ప్రజల్ని లక్ష్యంగా చేసుకోవాలని భావించారు. అయితే, భద్రతా బలగాల అప్రమత్తతతో పెను ఉగ్రదాడి తప్పింది.




మొదటిపేజీ తరువాయి

# వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకునే ముందు గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో పోలీసు బలగాల నుంచి రేవంత్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా సీఎం ప్రసంగిస్తూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, స్వేచ్ఛ, సామాజిక న్యాయమే పునాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన 'ప్రజా పాలన'ను అందిస్తోందని స్పష్టం చేశారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మొదటిపేజీ తరువాయి

# మోదీకి రాహుల్, ఖర్గే శుభాకాంక్షలు

బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది కూడా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ కూడా మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యం, సంతోషంతో సుదీర్ఘ జీవితం గడపాలని ఆకాంక్షించారు. మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ గురువారం 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 7తో మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తవుతాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 9న ప్రకటించారు. 2014 నుంచి కేంద్రంలో మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాల్లో మోదీ కీలకంగా వ్యవహరించారు.

మొదటిపేజీ తరువాయి

## డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు..

# త్రుటిలో తప్పిన ప్రమాదం

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో చింతపల్లి వద్దకు రాగానే ఆయన కారులో నుంచి పొగలు రావడం మొదలైంది. కారులో ఉన్న పవర్ బ్యాంక్ పేలడంతో కేబిన్‌లో మంటలు వేగంగా వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన ఎమ్మెల్యే, సిబ్బంది కారును నిలిపివేసి కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ మాత్రం స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే మరో వాహనంలో మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. తమ నాయకుడి కారులో మంటలు చెలరేగాయన్న వార్త తెలియడంతో నియోజకవర్గ ప్రజలు, అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన సురక్షితంగా ఉన్నారని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.



# నేను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించా

## .. గోడల మీద పెయింట్ వేసుకునే

## నీ సంగతి నాకు తెలియదా : కేటీఆర్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

గోడల మీద పెయింట్ వేసుకునే నీ సంగతి నాకు తెలియదా..కొండారెడ్డిపల్లి పోయి అడిగితే మీ బతుకు మొత్తం బయటపడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై(=వఝుత్ప్ర) ఫైర్ అయ్యారు. కేసీఆర్‌కు 1000 ఫాం హౌస్ వద్ద ఎకరాలు ఉందని ఒకసారి, నేడు 67 ఎకరాలని మరోసారి సీఎం చెప్పిన అబద్ధాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌లో 150 బెడ్ రూంలు ఉన్నాయని.. బంగారు బాత్రూంలు ఉన్నాయని చేసిన చిల్లర వ్యాఖ్యల్లో ఎంత నిజం ఉందో.. నిన్న రేవంత్ చేసిన ఆరోపణల్లో కూడా అంతే నిజం ఉందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయని మభ్యపెట్టే దాంట్లో ఎంత నిజం ఉందో, రేవంత్ రెడ్డి నిన్న మాట్లాడిన మాటల్లో కూడా అంతే నిజముందని ఎద్దేవా చేశారు

### కేసీఆర్ ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది

కేసీఆర్ పుట్టినప్పుడే ఆయన ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల భూమి ఉండేది. చింతమడకలో ఉన్న రెండెకరాల ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాలకు కేసీఆర్ రాసిచ్చారని గుర్తు చేశారు. గోడల మీద పెయింట్ వేసుకునే నీకు జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉండొచ్చు కానీ.. కేసీఆర్‌కు వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉండొద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మొదటినుండే వందల ఎకరాలు ఉన్నాయి. కేసీఆర్ దొర అంటావా, లేక ఈ మధ్య సంపాదించు కున్నాడు అంటావా? ఏదో ఒకటి ఫిక్స్ అవ్వు రేవంత్ రెడ్డి అని సూచించారు. నేను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించుకున్నాను. నువ్వు ఏమీ చేసి సంపాదించావు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు

### నీకు బుద్ధి, జ్ఞానం ఉందా?

రేవంత్ రెడ్డి 7 ఏండ్లు డిగ్రీ చదివిండు అని ఎద్దేవా చేశారు. కొండల్ రావు అని కూకట్‌పల్లిలో ఒక పెద్దాయన ఉంటే ఆయన ఆస్తులు కూడా మా దాంట్లో రేవంత్ రెడ్డి వేసేశాడు. ఆయనకి మాకు చుట్టరికం కూడా లేదు.. కేవలం వెలమ కులం అంతే. కేసీఆర్ అక్కాచెల్లెలు, అన్నతమ్ముళ్ల సంతానం 300 మంది ఉంటారు. వాళ్ల ఆస్తులు కూడా మా ఖాతాలో కలిపెయ్. సంతోష్ రావుకి మాకు చుట్టరికం ఉంటే ఆయన ఆస్తులు కూడా కేసీఆర్ ఖాతాలో వేస్తావా? నీ అన్నతమ్ముళ్ల వాళ్ల పిల్లల ఆస్తులు నీ ఖాతాలో వేస్తే ఎలా ఉంటుంది? అని నిలదీశారు. నవీన్ రావుకి, కొండల్ రావుకి మాకు ఏం సంబంధం? నీకు బుద్ధి జ్ఞానం ఉందా అని ప్రశ్నించారు.

## రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా కొరడా..

# దేశంలో పెట్రో ధరలు పెరుగుతాయా..?



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు17

అంతర్జాతీయ రాజకీయాల లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా కొరడా ఝులిపించింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కట్టబెట్టే బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. ఈ బిల్లు ఇప్పుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కోసం సిద్ధంగా ఉంది. ఈ పరిణామం రష్యా నుంచి భారీగా ముడిచమురును దిగుమతి చేసుకుంటున్న భారత్ పై తీవ్ర ప్రభావం చూపనుంది. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై అమెరికా కొత్త చట్టం ప్రభావం ఏవిధంగా ఉంటుందనే దానిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా 2022 నుంచి భారత్‌కు రష్యా అతిపెద్ద చమురు సరఫరాదారుగా మారింది. గణాంకాల ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరంలో భారత్ సుమారు 40.8 బిలియన్ డాలర్ల విలువైన రష్యా ముడిచమురును దిగుమతి చేసుకుంది. ఇది దేశం మొత్తం చమురు దిగుమతుల్లో 30.3 శాతానికి సమానం. 2026 జూలై నాటికి ఈ వాటా ఏకంగా 51 శాతానికి పెరిగింది. దేశీయ అవసరాల కోసం భారత్ 88 శాతానికి పైగా ముడిచమురును దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో రష్యా చమురు ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే అమెరికా చట్టం కారణంగా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆగిపోతే వెంటనే పెట్రోల్ బంకుల్లో ధరలు పెరుగుతాయని చెప్పలేం. భారత రిఫైనరీలు మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవచ్చు. కానీ ఇక్కడే ఒక చిక్కు ఉంది. రష్యా నుంచి లభించే రాయితీలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. ప్రత్యామ్నాయ చమురుకు ఎక్కువ వెల చెల్లించాల్సి రావచ్చు. అంతేకాకుండా ప్రపంచ మార్కెట్‌లోకి రష్యా చమురు రాక తగ్గితే మొత్తం సరఫరా తగ్గి అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగే ప్రమాదం ఉంది. ఇది భారత్‌పై పరోక్షంగా పెను భారాన్ని మోపుతుంది. ఈ కొత్త అమెరికా చట్టం ప్రకారం టారిఫ్‌లు భారత్‌లో అమ్మే పెట్రోల్‌పై నేరుగా కాకుండా అమెరికాకు భారత్ చేసే ఎగుమతులపై వర్తిస్తాయి. అంటే భారత్ రష్యా నుంచి చమురు కొనసాగిస్తే అమెరికాతో వాణిజ్యపరమైన రిస్క్ ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒకవేళ రష్యా నుంచి కొనుగోళ్లు ఆపేస్తే అధిక ధరలకు ఇతర దేశాల నుంచి చమురు కొనాల్సి వచ్చి ఆర్థిక భారం పెరుగుతుంది. ఇలా భారత్ ఒకరకమైన సంకట స్థితిలో పడింది. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలను అంతర్జాతీయ ధరలు, పన్నులు, రవాణా ఛార్జీలు, డీలర్ కమీషన్ల ఆధారంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయిస్తాయి. గతంలో ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం వినియోగదారులపై భారం తగ్గించడానికి ఎక్సైజ్ సుంకాలను సర్దుబాటు చేసింది. ఇప్పుడు కూడా తుది నిర్ణయం అంతర్జాతీయ ముడిచమురు ధరలు, ప్రత్యామ్నాయ సరఫరాల ఖర్చు, రూపాయి-డాలర్ మారకం విలువ, రిఫైనరీ మార్జిన్‌లు, ప్రభుత్వ విధానాలపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల పెట్రోల్ ధర ఎంత పెరుగుతుందనే దానిపై కచ్చితమైన అంచనాకు రావడం ప్రస్తుతానికి సాధ్యం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136